# ప్రశాంతంగా గ్రూప్–4 పరీక్ష



నిర్మల్‌లోని పరీక్ష కేంద్రం వద్ద హాల్ టికెట్లు పరిశీలిస్తున్న సిబ్బంది



నిర్మల్‌లోని పరీక్ష కేంద్రం వద్ద చిన్నారులతో కుటుంబ సభ్యులు



ఖానాపూర్‌లో కేఎస్ఆర్ కళాశాల కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

**ఖానాపూర్:** టీఎస్‌పీఎస్సీ గ్రూప్ – 4 పరీక్షలు శనివారం పట్టణంలో ప్రశాంతంగా జరిగాయి. పట్టణంలోని ఆరు పరీక్ష కేంద్రాల్లో 1632 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 1344 మంది హాజరయ్యారు. పరీక్షలకు 288 మంది గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు. పరీక్ష కేంద్రాలను కలెక్టర్ వరుణ్‌రెడ్డితో పాటు డీఆర్‌డీవో విజయలక్ష్మి తదితరులు వేర్వేరుగా తనిఖీ చేశారు.

**అసౌకర్యాలతో ఇక్కట్లు...**

పరీక్షలు రాసేందుకు వారి వెంట వచ్చిన కుటుంబీకులు, పిల్లలకు సేదతీరేందుకు అధికారులు ఎటువంటి సౌకర్యాలు కల్పించకపోవడంతో నానా ఇక్కట్లు పడ్డారు. కనీసం కేంద్రాల వద్ద నీడ కోసం టెంట్లు, తాగునీటి వసతి కల్పించేవారు కరువయ్యారు. పలువురు తల్లిదండ్రులు చిన్నారులను ఎత్తుకుని ఆడిస్తూ అవస్థలు పడ్డారు. ద్విచక్ర వాహనాలతో పాటు ఫోర్ వీలర్స్ నిలిపేందుకు సైతం స్థలం లేక రోడ్లపై ఎక్కడబడితే అక్కడ వాహనాలను పార్కింగ్ చేశారు. డీఎస్పీ నారాయణనాయక్, ఎస్సై ఆర్. శంకర్ ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు.

**సారంగపూర్‌లో...**

**సారంగపూర్:** మండలంలోని జామ్ సాంఘిక సంక్షేమశాఖ బాలికల గురుకుల విద్యాలయంలో శనివారం నిర్వహించిన గ్రూప్–4 పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఈ పరీక్షా కేంద్రంలో మొత్తం 384మంది అభ్యర్థులకు 298 మంది హాజరైనట్లు డీవో రమాకళ్యాణి తెలిపారు. పరీక్షా కేంద్రాన్ని నిర్మల్‌రూరల్ సీఐ శ్రీనివాస్, ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి తనిఖీ చేశారు. పరీక్షా కేంద్రానికి రెండు నిమిషాలు ఆలస్యంగా వచ్చిన నలుగురు అభ్యర్థులను పరీక్షా కేంద్రంలోకి అనుమతించకపోవడంతో వారు వెనుదిరిగారు.

**పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసిన డీఎస్పీ...**

**నిర్మల్‌టౌన్:** టీఎస్‌పీఎస్సీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో శనివారం నిర్వహించిన గ్రూప్ 4 పరీక్ష కేంద్రాలను డీఎస్పీ జీవన్‌రెడ్డి తనిఖీ చేశారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన 25 పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

**అభ్యర్థులకు చిరునామా చెబుతూ..**

**భైంసాటౌన్:** భైంసా పట్టణంలో 17పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా సేవాభారతి, భైంసా పోలీస్‌ల ఆధ్వర్యంలో ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన అభ్యర్థులకు పరీక్ష కేంద్రాల చిరునామా వివరాలు తెలిపేందుకు సహాయపడ్డారు. అలాగే సేవాభారతి ఆధ్వర్యంలో పరీక్షకేంద్రాల వద్ద అన్నదానం ఏర్పాటు చేశారు. పట్టణ సీఐ ఎల్.శ్రీను, ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్ ఆధ్వర్యంలో పరీక్ష కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన బందోబస్తును పర్యవేక్షించారు.

**వాటర్‌బాటిళ్ల పంపిణీ**

**ఖానాపూర్:** పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని పరీక్ష కేంద్రం వద్ద జాన్సన్ యువసేన ఆధ్వర్యంలో అభ్యర్థులకు తాగునీటి వసతి కల్పించారు. మధ్యాహ్నం, సాయంత్రం పరీక్ష కేంద్రం నుంచి బయటకు వచ్చిన వారికి యూత్ సభ్యులు వాటర్ బాటిళ్లు ఇచ్చారు. సభ్యులు సంతోశ్, సాబీర్, దివాకర్, స్టిఫెన్, అజయ్, సుమన్, ప్రసాద్, రాకేశ్, వంశీ, రాజేశ్, మజర్, సఫి, రమేశ్, సాగర్, దయాకర్, లక్ష్మణ్, శంకర్‌నాయక్, ప్రవీణ్ ఉన్నారు.



ఖానాపూర్: వాటర్ బాటిళ్లు పంపిణీ చేస్తూ..



భైంసాటౌన్: చిరునామా చెబుతున్న సభ్యులు



ఖానాపూర్: పరీక్ష కేంద్రం వద్ద చిన్నారితో..

## ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలి



భైంసాటౌన్: మొక్క నాటుతున్న దామోదర్‌రెడ్డి



ఖానాపూర్: వైద్యులను సన్మానిస్తున్న సభ్యులు

**భైంసాటౌన్:** ప్రజలు వైద్యుల సూచనలు, సలహాలు పాటిస్తూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని భైంసా డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు దామోదర్‌రెడ్డి అన్నారు. డాక్టర్స్ డేను పురస్కరించుకుని శనివారం భైంసాలోని రాహుల్‌నగర్‌లోగల ఎస్ఎస్ ఫంక్షన్ హాల్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆహార అలవాట్లు మారిన నేటి కాలంలో బీపీ, షుగర్ వంటి వ్యాధులు సర్వసాధారణమయ్యాయని, తరచూ పరీక్షలు చేయించుకోవాలన్నారు. అనంతరం మొక్కలు నాటారు. కార్యక్రమంలో వైద్యులు రామకృష్ణాగౌడ్, నగేశ్, అనిల్ జాదవ్, కుమార్ యాదవ్, ముత్యంరెడ్డి, అర్జున్, మహిపాల్, ప్రమోద్, చంద్రశేఖర్, స్థానిక కౌన్సిలర్ అనిత సూత్రావే ఉన్నారు.

**ఖానాపూర్‌లో సన్మానం...**

**ఖానాపూర్:** పట్టణంలోని వాసవి క్లబ్‌తో పాటు వనిత క్లబ్, లయన్స్ క్లబ్‌ల ఆధ్వర్యంలో వేర్వేరుగా వైద్యులు సీ అనిల్‌బాబు, కిరణ్‌కుమార్, రవికిరణ్, కేహెచ్‌ఖాన్‌ను సన్మానించారు. నాయకులు అజ్మీరా శ్యాంనాయక్ లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ఫండ్స్‌కు రూ.83వేల విరాళాన్ని అందజేశారు. వక్తలు మాట్లాడుతూ ప్రజల ప్రాణాలను కాపాడుతున్న వైద్యులు కనిపించే ప్రత్యక్ష దైవాలని అన్నారు. జితేందర్, సుదర్శన్, వెంకటస్వామి, వెంకటేశ్వర్లు ఉన్నారు.

## పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం

**లోకేశ్వరం:** మండల కేంద్రంలోని పెద్దమ్మ తల్లి ఆలయంలో ఆదివారం నుంచి గురువారం వరకూ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలను వేద పండితులు గురుమంచి చంద్రశేఖర్ శర్మ నిర్వహించనున్నారు. ఆదివారం దేవతామూర్తులు ఊరేగింపు, మహాగణపతి పూజ, పుణ్యావచనం, సోమవారం చండీహోమం, జలాదివాసం, మంగళవారం నిత్య సామూహిక కుంకుమార్చన, బుధవారం ఫల, పుష్ప శయ్యాదివాసం, సాంస్కృతిక కార్యక్రమాలు, గురువారం నిత్యనిధి యంత్రం, విగ్రహ ప్రతిష్ఠాపన, అమ్మవారి కల్యాణం, బోనాల సమర్పణ, అన్నదాన ప్రసాద కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆలయ కమిటీ తెలిపింది. పెద్దమ్మ తల్లి ఆలయం విద్యుత్ దీపాలతో అలంకరించారు.



సిద్ధమైన పెద్దమ్మ తల్లి ఆలయం

## వైభవంగా ప్రారంభమైన గురుపౌర్ణమి వేడుకలు

- 48 గంటలపాటు అఖండ సాయి నామ స్మరణ
- సాయిబాబా ఆలయానికి పోటెత్తిన భక్తులు..



భజన కార్యక్రమంలో భక్తులు

**నిర్మల్‌టౌన్:** ఆధ్యాత్మిక నిలయమైన గండి రామన్న క్షేత్రంలో శనివారం గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజులపాటు జరిగే వేడుకల కోసం ఇక్కడి సాయిబాబా ఆలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. వేడుకల్లో భాగంగా తొలిరోజు అఖండ సాయి నామంతో పూజా కార్యక్రమాలను ప్రారంభించారు. కామోల్, చించాల, ఎడిబిడ్ గ్రామాలకు చెందిన భజన మండలి ఆధ్వర్యంలో ప్రారంభించిన ఈ అఖండ సాయి నామం 48 గంటలపాటు కొనసాగనుంది. శిరిడీ నుంచి తీసుకొచ్చిన పట్టు వస్త్రాలతో సాయి బాబాను అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. బాబా దర్శనం కోసం భక్తులు ఉదయం నుంచే పెద్ద సంఖ్యలో బారులు తీరారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్ని సదుపాయాలు కల్పించారు. ఆదివారం ఉదయం 5:30 గంటలకు సాయి బాబాకు మంగళ స్నానం, అర్చన, పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు. సాయంత్రం 6 గంటలకు ఆలయ ప్రాంగణంలో పల్లకి ఊరేగింపు ఉంటుంది. మూడోరోజు సోమవారం గురుపౌర్ణమి పురస్కరించుకొని అర్చన, పాలాభిషేకం, అనంతరం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు ఆలయ సింగిల్ ట్రస్ట్ చైర్మన్ లక్కడి జగన్మోహన్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో సాయి దీక్ష సేవా సమితి సభ్యులు ఉప్పుల నందు, సోమేశ్, పూదరి నరహరి, మూర్తి మాస్టర్, ఆమెడ శ్రీధర్, మహేందర్ యాదవ్, కిషన్, గోవర్ధన్, రామచందర్, లక్ష్మణ్, జైపాల్ రెడ్డి, కళ్యాణి, భూషణ్, తదితరులు పాల్గొన్నారు.

### నూతన కమిటీ ఎన్నిక

**నిర్మల్‌టౌన్:** జిల్లా కేంద్రంలోని ప్రజాసంఘాల కార్యాలయంలో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం జిల్లా కమిటీని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ముఖ్యఅతిథిగా రాష్ట్ర అధ్యక్షురాలు అరుణ జ్యోతి హాజరయ్యారు. అధ్యక్షురాలుగా నైతం సుజాత, ఉపాధ్యక్షురాలు సుజాత, ప్రధాన కార్యదర్శి సోనీ, సహాయ కార్యదర్శిగా మల్లవ్వతో పాటు ఐదు మంది కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మహిళల సమస్యలపై పోరాడాలని అరుణ జ్యోతి నూతన కమిటీకి సూచించింది.

### నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**నిర్మల్‌చైన్‌గేట్:** నిర్మల్ పట్టణంలోని సబ్‌స్టేషన్ల పరిధిలో నెలవారీ మరమ్మతుల నేపథ్యంలో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏడీఈ రవి తెలిపారు. బుధవార్‌పేట్, ఓల్డ్ బస్టాండ్, పాత కలెక్టరేట్, ఇందిరానగర్, శాస్త్రీనగర్, ప్రియదర్శినినగర్, మైత్రినగర్, బాగులవాడ, భాగ్యనగర్, బర్కత్పుర, చిక్కడపల్లి, పాన్‌గల్లి, గొల్లపేట్, విజయనగర్ కాలనీలలో ఉదయం 8:30 నుండి 11గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

### నేడు ఎమ్మెల్యే రాక

**కుంటాల:** కుంటాల ఇలవేల్పు శ్రీగజ్జెలమ్మ ఆలయ ఆవరణలో భక్తుల సౌకర్యార్థం కోసం జుట్టు నారాయణ, జుట్టు నరేందర్ జ్ఞాపకార్థం రెండు వసతి గృహాలను దాతలు ఆదిలాబాద్ మున్సిపల్ కమిషనర్ శైలజ, ఎస్టీయూ నిర్మల్ జిల్లా బాధ్యులు జుట్టు గజేందర్ నిర్మించారు. వసతి గృహాల ప్రారంభోత్సవానికి ఆదివారం ఉదయం 11 గంటలకు ఎమ్మెల్యే విఠల్ రెడ్డి రానున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు శనివారం ప్రకటనలో పేర్కొన్నారు. గ్రామ పెద్దలు హాజరు కావాలని వారు కోరారు.

### పైపులైన్ లీకేజీతో చిన్నారులకు ఇబ్బంది



అంగన్‌వాడీ ఆవరణలో నీళ్లు

**కుభీర్:** మండల కేంద్రమైన కుభీర్‌లోని తహసీల్దార్ కార్యాలయం వద్ద మిషన్ భగీరథ పైపులైన్ పగిలి ఆ నీళ్లన్నీ పక్కనే ఉన్న అంగన్‌వాడీ ఆవరణలోకి ప్రవేశించడంతో అంగన్‌వాడీకి వచ్చే చిన్నారులకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. దీంతో అధికారులు పట్టించుకోవడం లేదని పిల్లల తల్లిదండ్రులు మండిపడుతున్నారు. భగీరథ అధికారులు మరమ్మతులు చేసి ఇబ్బందులు లేకుండా చూడాలని పలువురు కోరుతున్నారు. ఈ విషయమై గ్రామపంచాయతీ అధికారులను ప్రశ్నించగా మిషన్ భగీరథ అధికారులు వచ్చి మరమ్మతులు చేస్తారని తెలిపారు.

## బీఆర్ఎస్ బడుగు, బలహీనవర్గాల పార్టీ



చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే రేఖానాయక్

**కడెం:** బీఆర్ఎస్ బడుగు, బలహీన వర్గాల పార్టీ అని ఎమ్మెల్యే అజ్మీరా రేఖానాయక్ అన్నారు. శనివారం మండలంలోని సారంగపూర్ గ్రామంలో పలువురు బాధిత కుటుంబాలను పరామర్శించారు. అనంతరం మండల కేంద్రంలోని హరిత రిసార్ట్స్‌లో లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మండల కేంద్రానికి చెందిన సమీరుద్దీన్, జీహాన్‌దనిష్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. అక్కడి నుంచి దోస్తునగర్ గ్రామంలో నిర్వహించిన పల్లె పల్లెకు రేఖక్క కార్యక్రమంలో పాల్గొని, గ్రామంలో నెలకొన్న సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో జెడ్పీ కోఆప్షన్ మెంబర్ రఫీక్ అహ్మద్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు జొన్నల చంద్రశేఖర్, రైతుసమన్వయ సమితి మండల కన్వీనర్ జీవన్‌రెడ్డి, ఆత్మకమిటీ చైర్మన్ సతీశ్, ఏఎంసీ డైరెక్టర్ మంగ, సర్పంచ్‌లు రాముగౌడ్, రాజిరెడ్డి, లావణ్య, నాయకులు సత్తెన్న, మల్లేశ్, సాగర్, తిరుపతి,చోటు, హసీబ్, ముత్తన్న ఉన్నారు.

## నిందితులను కఠినంగా శిక్షించాలి



కుమురంభీం విగ్రహం వద్ద ఆదివాసీ నాయకులు

**కడెం:** ఆదివాసీ మహిళ కుడిమేత జంగుబాయిని అత్యాచారం, హత్య చేసిన ముగ్గురు నిందితులను కఠినంగా శిక్షించాలని ఆదివాసీ బిర్ధగోండ్(తోటి) యువసేనా నాయకులు డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలోని కుమురం భీం విగ్రహం వద్ద నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ ఫకీరాకు వినతి పత్రం అందజేశారు. ఆదివాసీ యువతులు, మహిళల రక్షణపై ప్రభుత్వాలు సవతి తల్లి ప్రేమను చూపిస్తున్నాయని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన శిక్షలను అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ బిర్ధగోండ్ యువసేనా నాయకులు దత్తు, రాందాస్, వెంకటేశ్, రవీందర్, సత్యనారయణ, భీంరావు, కిరణ్, సుశీల, చంద్రకళ, శకుంతల ఉన్నారు.

## బస్సు షెల్టర్ల ఏర్పాటుకు పరిశీలన



పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్, డిపో మేనేజర్

**నిర్మల్‌టౌన్:** జిల్లా కేంద్రంలోని మంచిర్యాల్ చౌరస్తా వద్ద బస్సు షెల్టర్ల ఏర్పాటుకు కృషి చేస్తామని మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్ అన్నారు. శనివారం మంచిర్యాల్ చౌరస్తా వద్ద ఆర్టీసీ డిపో మేనేజర్ సాయన్న, ట్రాఫిక్ పోలీసులతో కలిసి ఫుట్‌పాత్ బస్టాప్‌లను సందర్శించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ... చౌరస్తాలో భైంసా స్టాప్, అపోలో ఫార్మసీ ఒకే దగ్గర ఉండడంతో ప్రజలు ట్రాఫిక్‌తో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. దీనిని దృష్టిలో పెట్టుకొని మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి సహకారంతో బస్టాప్‌ను ముందుకు ఏర్పాటు చేస్తామన్నారు. చైర్మన్ వెంట ట్రాఫిక్ ఎస్సైలు దేవేందర్, రాజశేఖర్, ఆర్టీసీ సిబ్బంది ఉన్నారు.

## ప్రభుత్వ ఆస్పత్రిలో సౌకర్యాలు కల్పించాలి

**నిర్మల్‌చైన్‌గేట్:** జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో కనీస సౌకర్యాలు కల్పించాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సింగారి వెంకటేష్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కనీస సౌకర్యాలు లేక రోగులు, ప్రజలు సమస్యలతో విలవిలలాడుతున్నారన్నారు. తాగడానికి మంచినీరు లేక దుకాణాల్లో కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఉందన్నారు. మరుగుదొడ్లు, మూత్రశాలలు సరిగ్గా లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, బెడ్లపైన బెడ్‌షీట్ లేక గంటల తరబడి పేషెంట్ వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ప్రభుత్వం నుంచి జిల్లా ఆసుపత్రిలో అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు.

### క్లుప్తంగా

#### వైఎస్సార్‌టీపీ బలోపేతానికి కృషి



షర్మిలతో సిద్ధార్థ్ (ఫైల్)

**ఖానాపూర్:** వైఎస్సార్‌టీపీ అధినేత్రి వైఎస్ షర్మిల్ శనివారం ఆ పార్టీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షులు సిద్ధార్థ్ నాయక్‌కు ఫోన్ చేసి మాట్లాడినట్లు ఆయన తెలిపాడు. ఖానాపూర్ నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి సమష్టిగా కృషిచేయాలని కోరారని, దివంగత వైఎస్సార్ ప్రవేశపెట్టిన పథకాలు తిరిగి సక్రమంగా కొనసాగాలంటే, సంక్షేమ పాలన రాజన్న రాజ్యాంలోనే సాధ్యమవుతుందని తెలిపారు. ఈ నెల 9న లోటస్‌పాండ్‌లోని ఆ పార్టీ కార్యాలయానికి ఆహ్వానించినట్లు ఆయన పేర్కొన్నారు.

#### గోశాల నూతన కార్యవర్గం ఎన్నిక

**భైంసాటౌన్:** భైంసా పట్టణంలోని గోశాల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక నర్సింహానగర్‌లోని నర్సింహా కల్యాణ మండపంలో శుక్రవారం రాత్రి నిర్వహించిన సమావేశంలో హిందూ కులసంఘాల సమక్షంలో ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులు సుదర్శన్ పటేల్, అధ్యక్షుడిగా నిమ్మల్‌వార్ ప్రవీణ్, ప్రధాన కార్యదర్శిగా కుంట కాశినాథ్, కార్యదర్శిగా నూకల సురేష్, సహ కార్యదర్శులుగా సింధే లక్ష్మణ్ పటేల్, నంగి దత్తు, ఉపాధ్యక్షులుగా డా.కుమార్ యాదవ్, ప్రకాష్ వ్యాస్, తూమొల్ల దత్తాత్రి, సూర్యవంశి సంతోష్, మారుతి పాలావార్, బోల్‌శెట్టి సాయినాథ్, కోశాధికారిగా పార్వతొల్ల శ్రీనివాస్, సహ కోశాధికారిగా కపిల్, లీగల్ అడ్వైజర్‌గా తాడెవార్ సాయినాథ్, మీడియా ఇన్‌చార్జిగా బాలెవార్ రామకృష్ణ, పలువురు సభ్యులను ఎన్నుకున్నారు.

#### 'వడ్డెరబంధు ప్రకటించాలి'



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్

**కుంటాల:** రాష్ట్ర ప్రభుత్వం వడ్డెరలకు ప్రత్యేకంగా వడ్డెరబంధు ప్రకటించి ఆదుకోవాలని జిల్లా అధ్యక్షుడు సంపంగి ప్రభాకర్ డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని లింబా(కే), కుంటాల గ్రామాల్లో ఏర్పాటు చేసిన సంఘ సభ్యుల సమావేశంలో మాట్లాడారు. వడ్డెరులను ఎస్సీ జాబితాలో చేర్చాలని కోరారు. అడవి తల్లిని నమ్ముకుని జీవిస్తున్న ప్రతి ఒక్కరికి ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు వేముల గంగయ్య, సభ్యులు కుంటలవార్ నగేష్, గణపతి, రుస్తుం, రెడ్డి, పీరాజీ, శ్రీకాంత్, శంకర్, గంగాధర్, రాములు పాల్గొన్నారు.

#### బూత్ స్థాయి కమిటీలు పూర్తి చేయాలి



కమిటీ వివరాలు తెలుసుకుంటున్న వెంకట్

**లక్ష్మణచాంద:** మండలంలోని అన్ని గ్రామాల్లో బూత్ స్థాయి కమిటీలను వెంటనే పూర్తి చేయాలని బీజేపి పార్టీ విస్తారక్ వెంకట్ సూచించారు. శనివారం మండలంలోని చామన్‌పెల్లి, చింతల్‌చాంద, లక్ష్మణచాంద గ్రామాల్లో పర్యటించిన ఆయన ఆయా గ్రామాల్లో బూత్ స్థాయి కమిటీలను పరిశీలించారు. గ్రామాలలో అసంపూర్తిగా ఉన్న బూత్ స్థాయి కమిటీలను వెంటనే పూర్తి చేయాలని మండల కమిటీకి సూచించారు. అలాగే మండలంలోని అన్ని గ్రామాలలో బీజేపి పార్టీని బలోపేతం చేయాలని సూచించారు. ఇందులో బీజేపి మండల అధ్యక్షుడు గోవర్ధన్, ఉపాధ్యక్షుడు రంజిత్, మండల నాయకులు శ్రీధర్ రెడ్డి, రాజు, వెంకట్‌రెడ్డి, రాజేశ్వర్, దశగౌడ్ పాల్గొన్నారు.

#### సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



చెక్కు అందిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

**సర్సాపూర్(జి):** మండలంలోని చాక్‌పల్లి అనుబంధ గ్రామమైన దొంగుర్గాం గ్రామానికి చెందిన సాగర్‌కు ముధోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి సహకారంతో సీఎంఆర్ఎఫ్ కింద మంజూరైన రూ.45వేల చెక్కును శనివారం బీఆర్ఎస్ నాయకులు లబ్ధిదారుడికి అందజేశారు. కార్యక్రమంలో నాయకులు మ్యాదరి సుధాకర్, జంగిపల్లి సంతోష్, జంగిపల్లి దయాకర్, ఉదయ్ పాల్గొన్నారు.

#### 'పట్టాలిచ్చి రైతులకు న్యాయం చేయాలి'



నిరసనలో రైతులు, కాంగ్రెస్ నాయకులు

**భైంసాటౌన్:** తానూరు మండలం మొగిలి గ్రామానికి చెందిన రైతులు సాగు చేసుకుంటున్న పోడు భూములకు పట్టాలిచ్చి వారికి న్యాయం చేయాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు సింధే ఆనంద్‌రావు పటేల్ డిమాండ్ చేశారు. భైంసాలోని అంబేద్కర్ విగ్రహం వద్ద శనివారం రైతులతో కలిసి నిరసన తెలిపారు. కొన్నేళ్లుగా సాగు చేసుకుంటున్న భూమికి పట్టాలిస్తామని గ్రామసభలో తీర్మానం చేశారని, ప్రస్తుతం వాటిని ఇతరులకు కట్టబెట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. సదరు భూమికి అటవీ భూమి హక్కుల చట్టం ప్రకారం పోడుభూములకు పట్టాలిప్పించాలని కోరారు.

#### బీఆర్ఎస్ పాలనలో విద్యుత్ చార్జీల భారం



రాజూరలో మాట్లాడుతున్న మోహన్‌రావు పటేల్

**లోకేశ్వరం:** బీఆర్ఎస్ పాలనలో ప్రజలపై విద్యుత్ చార్జీల భారం పడుతోందని, ప్రతీ సంవత్సరం విద్యుత్‌చార్జీలు పెంచుతున్నారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మోహన్‌రావు పటేల్ అన్నారు. శనివారం మండలంలోని రాజూర గ్రామంలో పల్లె పల్లెకు బీజేపీ గడపగడపకూ మోహన్‌రావు పటేల్ అనే కార్యక్రమంలో భాగంగా బీజేపీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సుభాష్ పటేల్, లింగాల పోతన్న, నరహరి, అనిల్, భూమన్న ఉన్నారు.